www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శుక్రవారం | 04 | జూలై | 2025 పేజీలు : 8


## వరద ఉధృతి అంచనాలను అందించాలి



-ప్రమాద హెచ్చరికల ఎస్ఓపి సిద్ధం
- నీటి వనరుల రిపోర్టింగ్ షెడ్యూల్ తయారు చేయాలి
-విపత్తుల సన్నద్ధతపై కలెక్టర్ సమావేశం

2 లో

## కవిత ఏ పార్టీలో ఉన్నట్టో..!



-కవిత పర్యటనకు దూరంగా బిఆర్ఎస్ నేతలు
-జాగృతి పేరుతోనే కార్యకలాపాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రోజుకో ప్రకటనతో ఉనికిని చాటుకున్న శాసనమండలి సభ్యురాలు కవిత ఏ పార్టీలో ఉన్నారు అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఒకవేళ బిఆర్ఎస్‌లో ఉంటే శాసనమండలి సభ్యురాలిగా, బిఆర్ ఎస్ నాయకురాలిగా ఆమె జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు బిఆర్ఎస్ నాయకులు ఎందుకు పాల్గొనడం లేదన్నది కూడా చర్చనీయాంశమైంది. కల్వకుంట్ల కవిత పరామర్శల పేరుతో బుధవారం ఖమ్మంజిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి, ఖమ్మంలో మీడియా సమావేశాలను నిర్వహించగా ఎక్కడ బిఆర్ఎస్‌లో ఒక స్థాయి కలిగిన నేతలు పాల్గొనలేదు. ఖమ్మంలో జరిగిన మీడియా సమావేశానికి ముగ్గురు బిసి నేతలు హాజరయ్యారు. మూడు మసాల క్రితం కల్వకుంట్ల కవిత రాసిన ఒక లేఖ బిఆర్ఎస్‌లో అంతర్గత చర్చకు దారి తీయడంతో పాటు సంచనలం కలిగించింది. అదే సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ చర్చకు దారి తీసింది. అన్నింటికి మించి బిజెపి విషయంలో బిఆర్ఎస్ మెతక వైఖరిని అవలంభిస్తున్నారని వరంగల్ సభలో మరింత కటువుగా మాట్లాడాల్సింది అంటూ ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. ఆనాటి నుంచి కవిత బిఆర్ఎస్ నాయకురాలిగా కాకుండా జాగృతి అధ్యక్షురాలిగానే కార్యకలాపాలు నిర్వహిస్తూ ఏదో ఒక కార్యక్రమం పేరుతో రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. బిఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, ప్రస్తుత శాసన సభ్యులు, మాజీ శాసన సభ్యులు ఇలా ఎవరు ఆమె సమావేశాలకు హాజరు కావడం లేదు. కాళేశ్వరం పై విచారణకు కేసిఆర్ హాజరవుతున్న సమయంలో ఆమె కేసిఆర్ పామ్‌హౌజ్‌కు వెల్లిన కేసిఆర్ కానీ

మిగతా 2లో..

## అధికారి కానీ సర్వాధికారి..!

-అశ్వాపురం విద్యుత్ శాఖలో వసూళ్ల షాడో
-అధికారులకు ఆయన మాటే వేదం






ఆయన అధికారి కాడు, ఏ ప్రభుత్వ శాఖలోనూ పని చేయడం లేదు. కానీ విద్యుత్ శాఖలో ఆయన చెప్పిన పని గంటల్లో అయిపోతుంది. ఎవరికి బిల్లులు తగ్గించాలన్న, విద్యుత్ కనెక్షన్ రావాలన్న, విద్యుత్ స్తంభాలు సరఫరా చేయాలన్న ఈ సారు చెప్పాల్సిందే. ప్రజా ప్రతినిధుల కంటే సారూ మాటకే ఇక్కడ విద్యుత్ శాఖాధికారులు ప్రాధాన్యతనిస్తారు. గిరిజన మండలమైన అశ్వాపురంలో విద్యుత్ వినియోగదారులందరూ ఆ వసూళ్ల షాడోనే విద్యుత్ శాఖాధికారి అనుకోవడం శోచనీయం.

-ప్రజాపక్షం/అశ్వాపురం

2 లో

## అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు



-మౌలిక వసతుల కల్పనకు కృషి
-సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం రఘునాథపాలెం మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో పర్యటించి ఎస్సి కాలనీ నందు (ఎస్‌సిసి) నిధులు రూ. 50 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా తొలి విడత గుడిసెల్లో ఉన్న నిరుపేదలను ఎంపిక చేసి ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా గుడిసెల్లో ఉంటూ ఇందిరమ్మ ఇండ్లు రాని వారు ఉంటే ప్రతిపాదనలు అందించాలని వెంటనే మంజూరు చేస్తామన్నారు. దశల వారీగా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయన్నారు. గ్రామంలో గుడిసెల్లో ఉంటున్న వారి ఫోటోలు తీసుకుని రావాలని మంత్రి తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తామన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతు సంక్షేమమే

మిగతా 2లో..

## పాలేరు అభివృద్ధికి రూ.1400 కోట్లు ఖర్చు



-కూసుమంచి అభివృద్ధికి ప్రాధాన్యత
-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/ కూసుమంచి :** పాలేరు నియోజక వర్గ అభివృద్ధికి 19 మాసాల కాలంలో రూ. 1400 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి మండల కేంద్రాన్ని ప్రధాన పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. గురువారం కూసుమంచిమండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ధర్మతండా గ్రామంలో రూ. 36 లక్షలతో చేపట్టే కూసుమంచి, ధర్మతండా రోడ్డు మరమ్మతు పనులకు లోక్యాతండాలో రూ. 1.26 కోట్లతో చేపట్టే రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించడంతో పాటు లోక్యాతండాలో రూ. 2.90 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ధనియాతండా, ముటాపురం బిటి రోడ్డు నిర్మాణ పనులకు కూసుమంచి గ్రామంలో రూ. 6.50 కోట్లతో చేపట్టే జంక్షన్ అభివృద్ధి పనులు ఖమ్మం, కోదాడ, కూసుమంచి, నేలకొండపల్లి పట్టణ పరిధిలోని డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. లోక్యాతండాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్దిదారులను ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని లబ్దిదారుల ఖాతాల్లో విడతల వారీగా జమ చేస్తామని పొంగులేటి తెలిపారు. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన

మిగతా 2లో..

# కవిత ఏ పార్టీలో ఉన్నట్టో..!

(మొదటిపేజీ తరువాయి)

ఆమె సోదరుడు కేటిఆర్ కానీ కవితతో మాట్లాడలేదని సమాచారం. కవిత మాత్రం అటు బిజెపి, ఇటు కాంగ్రెస్ పార్టీలను విమర్శించడంతో పాటు ఈ మధ్య ఉత్తరాలు రాయడం చేస్తున్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన రాంచందర్‌రావుకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు కృషి చేయాలని ఒక లేఖ రాశారు. బుధవారం కవిత పర్యటన సందర్భంలో ఖమ్మంజిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధుసూదన్ ఖమ్మంజిల్లాలోనే ఉండి ఆమె పర్యటనకు హాజరు కాక పోగా కవిత మీడియా సమావేశం నిర్వహించిన నేలకొండపల్లిలోనే తాతా మధుసూదన్ కూడా విడిగా మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయి విమర్శలు చేశారు. తాతా మధుసూదన్ నిర్వహించిన మీడిమా సమావేశానికి ప్రాధాన్యతనిచ్చిన బిఆర్ఎస్ పార్టీ పత్రిక కవిత మీడియా సమావేశానికి అంత ప్రాధాన్యతనివ్వ లేదు. కాంగ్రెస్‌ను విమర్శించే వార్తలకు ప్రాధాన్యతనిచ్చే బిఆర్ఎస్ పత్రిక కవిత పర్యటన నామ మాత్రంగా ప్రచురించడం గమనార్హం. కేసిఆర్ కుమార్తెగా, నాడు ఎంపిగా ఎక్కడ పర్యటించినా అడుగులకు మడుగులొత్తుతూ హడావుడి సృష్టించే బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఎందుకు పాల్గొనడం లేదన్న దానిపై ఆ పార్టీ నేతలు ఎవరు స్పందించేందుకు సిద్ధంగా లేరు. అసలు కవిత ఏ పార్టీలో ఉన్నారని అడిగినా సమాధానం చెప్పడం లేదు. 2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత బిఆర్ఎస్ రాజకీయంగా ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం తప్పిదాలు, కార్ రేస్ తదితర వ్యవహారాలు ఆ పార్టీ నేతల మెడకు చుట్టుకోనున్నాయన్న ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కవిత వ్యవహారం పుండుకు పుల్లపోటుగా మారింది. మొత్తంగా 2002 తర్వాత కేసిఆర్ కుటుంబంలో రాజకీయ విబేధాలు రచ్చకెక్కాయి. జాగృతి పేరుతో కవిత రాష్ట్ర మంతా తిరుగుతుండడం ఓ దశలో పార్టీ మారుతారన్న చర్చ జరిగిన నేపథ్యంలో ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు హాజరు కాక పోవడంతో అసలు కవిత బిఆర్ఎస్‌లో ఉన్నారా లేక బిఆర్ఎస్‌ను వదిలి జాగృతికే పరిమితమయ్యారా అన్నది తేలాల్సి ఉంది.

# అధికారి కానీ సర్వాధికారి..!

**ప్రజాపక్షం/ అశ్వాపురం :** అశ్వాపురం విద్యుత్ శాఖలో ఒక అనాధికారి హల్‌చల్ చేస్తున్నాడు. రైతులు, వ్యాపారుల నుండి పెద్ద మొత్తంలో వసూలు చేసిన ఘటనలు వెలుగుచూస్తుండగా మరో పక్క విద్యుత్ శాఖాధికారులు ఆయనకు జీ హుజూర్ అనడం కూడా గమనర్హాం. అశ్వాపురం విద్యుత్ శాఖలో ఓ ప్రైవేటు వ్యక్తి రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పిస్తానని వేల రూపాయలు వసూలు చేస్తున్నాడు. రైతు కోరిన చోటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం సాధ్యమవుతుందా లేదా అనేది పక్కన పెట్టి ముందు డబ్బులు తీసుకుంటాడు. ఆ తర్వాత విద్యుత్ శాఖాధికారులు కూడా ఆయన చెప్పిన చోటికి విద్యుత్ స్తంభాలు తరలించి విద్యుత్ సౌకర్యం కల్పించడం పలు అనుమానాలకు తావిస్తుంది. విద్యుత్ శాఖలో ఏ పని అయిన మీరు నన్ను సంప్రదించండి ఖర్చులు భరించండి. మీ పని చేస్తానంటూ గ్రామ గ్రామాన తిరుగుతున్నాడు. చాలా గ్రామాల్లో రైతులు ఈ షాడోనే విద్యుత్ శాఖాధికారి అనుకోవడం విద్యుత్ శాఖాధికారులు వచ్చినా వారిని రైతులు గుర్తించక పోవడం గమనార్హం. గొల్లగూడెం గ్రామంలో బాగయ్య, నర్సింహారావు అనే రైతులకు వ్యవసాయ మోటార్ విద్యుత్ కనెక్షన్ ఇప్పిస్తానని ఆరేండ్ల క్రితం రూ. 25వేలు వసూలు చేశాడు. అశ్వాపురంలో ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పిస్తానని ఇంటికి ఐదు వేల రూపాయల చొప్పున వసూలు చేశాడు. మరి కొన్ని గ్రామాల్లో విద్యుత్ కనెక్షన్లు తదితర విషయాలు చెప్పి పెద్ద మొత్తంలో వసూలు చేశాడు. తానే కాంట్రాక్టర్‌ని అంటూ వసూళ్ల పర్వానికి తెర లేపాడు. పలుమార్లు డివిజనల్ విద్యుత్ శాఖాధికారుల పేర్లను కూడా వాడుకుని వసూళ్లు చేసినా విద్యుత్ శాఖాధికారులు కనీసం స్పందించ లేదు. అతనికి డబ్బులు చెల్లించి విద్యుత్ సౌకర్యం లేక బాధితులు విద్యుత్ శాఖ కార్యాలయానికి ప్రతి రోజు తిరుగుతున్నారు. విద్యుత్ శాఖాధికారులు బాధితుల గోడు వింటున్నారు తప్ప ఎందుకు వసూళ్లు చేశావు అని ప్రశ్నించే ధైర్యం చేయక పోగా ఆ షాడో వైపు కనీసం కన్నెత్తి చూడలేకపోతున్నారు. ఈ షాడో ఆగడాలను అరికట్టి బాధితులకు న్యాయం చేయాలని వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. బాధితులకు న్యాయం చేయడంతో పాటు ఈ వసూళ్ల రాయుడుపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఎప్పటి నుంచో విద్యుత్ శాఖాధికారుల వెంట తిరుగుతూ ఆదేశాలు జారీ చేస్తుండడంతో అధికారి ఏమో అని నమ్మి డబ్బులు ఇచ్చామని బాధితులు వాపోతున్నారు. ఇదే విషయమై విద్యుత్ శాఖ ఏఈ మణిదీప్‌ను వివరణ కోరగా అశ్వాపురం మండలంలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్న మాట వాస్తవమేనని ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చామని ఆయన తెలిపారు. గత కొన్ని రోజులుగా షాడో ఫోన్ ఎత్తక పోవడం స్విచ్చాప్ చేసుకోవడంతో విద్యుత్ శాఖ కార్యాలయానికి వచ్చే బాధితుల సంఖ్య మరింత పెరిగింది.

# తప్పులు కప్పిపుచ్చుకునేందుకే విద్వేష ప్రకటనలు

**-సమన్వయంతోనే సమస్యల పరిష్కారం**
**-సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి**
**-మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు**




**ప్రజాపక్షం/ఖమ్మం :** కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతున్నాయని సిపిఐ (ఎంఎల్)ప్రజాపంథా మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు, బిఆర్ఎస్ కుంభకోణాల నుంచి బయటపడేందుకు విద్వేషాన్ని రెచ్చగొడుతున్నాయని ఆయన ఆరోపించారు. గురువారం స్థానిక రామనర్సయ్య భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రంగారావు మాట్లాడుతూ బనకచెర్ల, పోలవరం అనుసంధాన ప్రాజెక్టుపై రాద్ధాంతం చేస్తున్నారని ఈ రెండింటి మధ్య వివాదాన్ని పెంచి పెద్దన్న పాత్ర పోషించాలని బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు పాలక, ప్రతిపక్ష పార్టీలు చెబుతున్న మాటలకు, చేస్తున్న ప్రకటనలకు రెచ్చిపోకుండా సమన్వయం పాటించాలని ఆయన సూచించారు. గోదావరి, కృష్ణా నికర జలాలకు సంబంధించి హేతుబద్ధమైన పంపిణీ జరగాలని ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గతంలో ఇచ్చిన ట్రిబ్యునల్‌కు కట్టుబడి పంపిణీ చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. తెలంగాణ, ఆంధ్రాల మధ్య పంపిణీలో హేతుబద్దత లోపించిందని మిగులు జలాల వినియోగంపై కూడా తగు చర్చలు జరగాలన్నారు. శాస్త్రీయ పద్దతిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కేంద్ర జల సంఘం రెండు ప్రభుత్వాల మధ్య చర్చలు జరిపి జాప్యం లేకుండా పరిష్కారం చూపాలన్నారు. సార్వత్రిక సమ్మెకు సిపిఐ(ఎంఎల్)ప్రజాపంథా మాస్ లైన్ పూర్తి మద్దతునిస్తుందని రంగారావు తెలిపారు. రైతు, కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో జరిగే బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, సివై పుల్లయ్య, జి. రామయ్య, ఆవుల అశోక్, కోల్లేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జులై తొమ్మిదిన ఆటో బంద్‌ను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఖమ్మం :** జులై తొమ్మిదిన సార్వత్రిక సమ్మె సందర్భంగా జరిగే ఆటోల సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగే సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు పాల్వంచ కృష్ణ, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, జాకీర్, సిఐటియు జిల్లా కార్యదర్శి తుమ్మా విష్ణు, టియుసిఐ నాయకులు శ్రీనివాస్, బిఆర్‌టియు నాయకులు వై. పాషా పాల్గొన్నారు.



# అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసినట్లు మంత్రి తెలిపారు. వానాకాలం సాగు పెట్టుబడికి ఉపయోగపడేవిధంగా వ్యవసాయోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పథకం క్రింద రూ. 6వేలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామన్నారు. రైతులు లాభసాటి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో పాటు అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చునని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలను అందిస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని మంత్రి తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుల్లయ్య, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, రేమళ్ల రమేష్, బండి నాగేశ్వరరావు, అర్వికట్ల ప్రేమ్‌కుమార్, అర్వికట్ల సుధీర్, చల్లగుండ్ల శ్రీనివాసరావు, గుర్రం రవీందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు అభివృద్ధికి రూ.1400 కోట్లు ఖర్చు

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కూసుమంచి మండల కేంద్రంలో అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, త్రాగునీటి సమస్యను పరిష్కరించామని ఇదే సందర్భంలో రూ. 50 లక్షలతో నిర్మించే షాదీఖానాను కూడా మంజూరు చేయించుకోవడం జరిగిందన్నారు. దీనికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు రూ. 5.50 కోట్లు మంజూరు చేయడం జరిగిందని త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తుందని పొంగులేటి తెలిపారు. గత పాలకులు అమలు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అదనంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలెండర్‌కు ఇవ్వడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డు లబ్దిదారులకు సన్నబియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ, డైట్ ఛార్జీల పెంపు ఇందిరమ్మ ప్రభుత్వం చేసిన ఘనత అని ఆయన తెలిపారు. ఆర్థిక సాయం అందించామని రూ. 21వేల కోట్ల తో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేపట్టామన్నారు. గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో ఎకరాకు రూ. 10వేలు ఇస్తే ఇందిరమ్మ ప్రభుత్వం రూ. 12వేలు ఇస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇండ్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో జి. నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఈఈ మిషన్ భగీరథ వాణిశ్రీ, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, వ్యవసాయ సహాయ సంచాలకులు సరిత, స్థానిక మండల అధికారులు పాల్గొన్నారు.

# వరద ఉధృతి అంచనాలను అందించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వరద ఉధృతి అంచనాలను సమర్థవంతంగా అందించాలని ఆ దిశగా పటిష్ఠ వ్యవస్థను జిల్లాలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి విపత్తుల సన్నద్ధతపై సంబంధిత అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల గురించి మనకు ఎంత త్వరగా తెలిస్తే అంత త్వరగా ప్రజల సంరక్షణకు చర్యలు తీసుకోవచ్చునన్నారు. వరద అంచనా వ్యవస్థ కట్టుదిట్టంగా పని చేయాలని, నీటి వనరుల్లో నీటి నిల్వలు, పైన ఉన్న మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కురిసే వర్షాలు, వస్తున్న వరదల వివరాలను నీటిపారుదల శాఖాధికారులు రెగ్యులర్‌గా మానిటర్ చేయాలన్నారు. భద్రాచలంలో వరద ఉధృతికి సంబంధించి పకడ్బందీ వ్యవస్థ ఉందని భద్రాచలం వద్ద వరద వివరాలు ప్రతి గంటకు తెలుస్తాయని ఆ దిశగా ఖమ్మంజిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలని, వరద ఉధృతిని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా అంచనా వేయాలన్నారు. తీర్దాల, మున్నేరు, ఆకేరు తదితర వాటి వద్ద నీటి ప్రవాహం, నీటి నిల్వ ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. జిల్లాలో అవసరమైన చోట వాటర్ గేజ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులతో వాట్సప్ గ్రూప్ తయారు చేయాలన్నారు. నీటివనరుల పరిస్థితులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. రాబోయే మూడు నెలల పాటు రిపోర్టింగ్ షెడ్యూల్ సిద్ధం చేసి సోమవారం నాటికి అందించాలన్నారు. ఖమ్మం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో వరద విపత్తు నిర్వహణ బాధ్యత అధికంగా రెవెన్యూ వ్యవస్థ పై ఉంటుందని అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న నీటి వనరులను పరిశీలించి తెగిపోకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ముఖ్య ప్రణాళికాధికారి ఎ. శ్రీనివాస్, జిల్లా ఇరిగేషన్ అధికారి వెంకట్రామ్, ఆర్డివో జి. నర్సింహారావు, ఇరిగేషన్ డిఈలు, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్‌లు సైదులు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ టూటౌన్ కార్యదర్శిగా సాంబశివరెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం రెండవ పట్టణ కార్యదర్శిగా వై. సాంబశివరెడ్డి ఎన్నికయ్యారు. గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సిపిఐ శత వసంతాల సందర్భంగా జరుగుతున్న కార్యక్రమాల జయప్రదం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన కోరారు. సహాయ కార్యదర్శులుగా బోడా వీరన్న, ఎస్‌కె సైదాలు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, మున్సిపల్ కార్పోరేటర్ బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

**-జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సాంప్రదాయ పంటలు కాకుండా రైతులు ఆయిల్ పామ్ వంటి పంటలను సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. గురువారం జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో పర్యటించి పలు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పత్తి, పెసర, ఆయిల్ పామ్‌లో అంతర పంటగా సాగు చేస్తున్న పత్తి పంటలను పరిశీలించారు. రైతులకు పంటల సాగుకు సంబంధించి పలు సలహాలు, సూచనలిచ్చారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ రైతులు యూరియా, డిఏపికి బదులు నానో యూరియా, డిఏపిలను వాడాలన్నారు. వాటి వాడకం వల్ల రైతులకు రసాయనాలకు పెట్టేటటువంటి ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణ కాలుష్యం అవ్వకుండా, భూమిని కూడా కాపాడుకోవచ్చునన్నారు. నీటి వసతి ఉన్న రైతులందరూ ఆయిల్ పామ్ సాగు చేసుకోవాలని తద్వారా అన్ని పంటల కంటే ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలుగా ఇతర పంటలు సాగు చేసుకుంటే ప్రభుత్వం ప్రోత్సాహం కూడా ఇస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులకు మొదటి మూడు సంవత్సరాలు రాయితీలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవో ప్రతిభ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి సాగులో సస్యరక్షణ చర్యలపై అవగాహన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పత్తి సాగులో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పత్తిలో గులాబీ రంగు పురుగు సమగ్ర సస్యరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ప్రొటక్షన్ ఆఫీసర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ పత్తి సాగుకు సంబంధించి ఎకరానికి ఐదు లింగాకర్షక బుట్టలు పెట్టుకోని గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించాలన్నారు. గులాబీ రంగు పురుగును గుర్తించిన యేడల ముందుగా వేపనూనెతో పిచికారి చేయాలని తర్వాత కూడా ఉధృతి ఎక్కువగా ఉంటే రసాయన మందులు వాడాలని తెలిపారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ మిత్ర పురుగులు, ట్రైకోకార్డ్ పరాన్న జీవుల ఉపయోగాల గురించి, ఎన్‌పిఎస్ఎస్ మొబైల్ యాప్ ఉపయోగం గురించి వివరించారు. రసాయన పురుగు మందులు వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి బసవనప్ప, విత్తన శుద్ధి ఉపయోగాల గురించి హోన్నప్ప వివరించారు. ఏఈవో వేదిత పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. శ్రీ బాలాజీ ఎఫ్‌పివో ఛైర్మన్ గుత్తా వెంకటేశ్వర్లు వారి అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా వాడాకాన్ని రైతులు ప్రోత్సహించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా వాడాకాన్ని రైతులు ప్రోత్సహించాలని మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని బోనకల్, చిరునోముల, రావినూతల, బ్రాహ్మణపల్లి, రామాపురం, కలకోట గ్రామాల్లో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ మాట్లాడుతూ నానో యూరియా కణాలు చాలా చిన్న పరిమాణం కలిగి ఉండటం వలన పంటకు దాని లభ్యత 80శాతం కన్నా ఎక్కువ ఉంటుందన్నారు. ఇది మొక్కల నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తూ ఆకుల్లో కిరణ జన్య సంయోగక్రియను పెంచుతుందని, వేర్లలో కణజాలము వృద్ధి చెందితుందన్నారు. పంట ఉత్పాదకతను పెంచి పంట సాగు ఖర్చు తగ్గించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచుతుందన్నారు. రైతులు 500మి.లీ నానో యూరియా బాటిల్‌ను సులభంగా ఉపయోగించవచ్చని, నిల్వ చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు బంధం రజిత, పండగ అనూష, మరీదు త్రివేణి, షేక్.హుస్సేన్‌సాహెబ్, గోగుల హరికృష్ణ, నాగినేని నాగసాయి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఏదులాపురంలో ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురంలో గల జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లను స్వీకరిస్తున్నట్లు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ బి.శివకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్ చదువు మధ్యలో మానేసి ఇప్పుడు చదువుకోవాలని ఆసక్తి ఉన్నవారు. రెగ్యులర్గా స్కూల్, కళాశాలకు వెళ్లలేనివారు, సార్వత్రిక విధానం ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నరు. అలాగే 16సంవత్సరాలు నిండి అసలు చదువుకోని వారు ఓపెన్‌టెన్త్ ఇది పూర్తయినవారు ఇంటర్‌మీడియట్ చదువుకోవచ్చున్నారు. అడ్మిషన్ పొందాలనుకునేవారు కులం, ఆదాయం, ఆధార్‌కార్డ్ సర్టిఫికెట్లతో పాటు రెండుపాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈనెల 11వ తేదీ వరకు ధరకాస్తు చేసుకోవాలని సూచించారు.

# 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** జులై9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిడకంటి చిన్న వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో గల సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంరూరల్ మండల కౌన్సిల్ సమావేశాన్ని తద్దె రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతు సంఘాలు అన్ని కలిసి సంయుక్త కిసాన్ మోర్చా(కే.ఎస్.ఎం)గా ఏర్పడి సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు అసంఘటిత చట్టాలను రద్దు చేయడం కుట్టపూరిత అంశం అని ధ్వజమెత్తారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకు మోడీ ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆరోపించారు. గతంలో సైతం నల్ల చట్టాలను రైతులు ఏ విధంగా ప్రతిఘటించమో మరల అదే పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. పంటల బీమాతో పాటు స్వామినాథన్ కమిషన్‌ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మామిడి సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి ఏలూరి భాస్కర్, జిల్లా నాయకులు యడ్లపల్లి శంకరయ్య, వెన్నం భాస్కర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, రైతు సంఘం మండల నాయకులు వెంపటి సురేందర్, మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, ధనమూర్తి, రమేష్, మామిండ్ల నిరంజన్‌రెడ్డి, బొడ్డు ఉపేందర్, లక్ష్మి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కేతినేనికి పలువురి నివాళి




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని రేగులచలక గ్రామానికి చెందిన కేతినేని వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఆయన మృతికి పలువురు నివాళులర్పించారు. గురువారం రేగులచలకలో నిర్వహించిన వెంకటేశ్వర్లు దశ దిన కర్మలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వ్యక్తిగత సహాయకులు రవికిరణ్ తో పాటు పలువురు నాయకులు పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరునాయక్, మాజీ సర్పంచులు మాధంశెట్టి హరిప్రసాద్, మెంటెం రామారావు, చెరుకూరి ప్రదీప్, కొర్లపాటి రామారావు, కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, నున్నా శ్రీనివాసరావు, నున్నా వెంకటేశ్వర్లు, భిక్షమయ్య, రాధాకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్ధికసాయం



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండల పరిధిలోని చిన్నబీరవల్లి గ్రామపంచాయతీనందు యాదాల సుందర్‌రావు తండ్రి ఆశీర్వాదం ఇటీవల కాలుకు తీవ్రగాయమై ఆపరేషన్ జరుగగా గత రాత్రి గుండె పోటుకు గురై మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులను కాంగ్రెస్ గ్రామ కమిటీ ఓదార్చి మాజీ ఎంపిటిసి సభ్యులు చంద్ర శ్రీలక్ష్మి కిరణ్ సహకారంతో రూ.5వేలు ఆర్థిక సాయం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు గత్తం బాలరాజు, గౌరవాధ్యక్షులు చంద్ర వెంకట్రావు, కోశాధికారి మర్సకట్ల సంజీవరావు, సహాయ కార్యదర్శి బుద్ధ భూపాల్, సభ్యులు సోమ శాంతయ్య, లింగాల అంజి, ముళ్ళపాటి అబ్రహం, యూత్ సభ్యులు తోటమాల రవి, పాగికుమార్, గుజ్జు రాజేంద్రప్రసాద్, యాదాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్వర్టర్ వితరణ




**ప్రజాపక్షం/చింతకాని :** మొహరం పండుగ సందర్భంగా నేరడ మత్స్యసఘం సభ్యులు గ్రామంలోని పీర్లచావిడి ముజావర్లు షేక్ మదార్ సాహెబ్, షేక్ బాబు, షేక్ హుస్సేన్, షేక్ బ్రహ్మంలకు ఇన్వర్టర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులు మత్స్యసంఘం సభ్యులును అభినంధించారు. గ్రామంలో హిందూ, ముస్లీంలు కలిసి పీర్ల పండుగను ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీఉపసర్పంచ్ దూసరి గోపాలరావు, మట్టా చిన్న కృష్ణ, పెద్ద వెంకయ్య, పులిపాటి వెంకన్న, మట్టా ఆదినారాయణ, పొట్లపల్లి కోటయ్య, మట్టా సీతారాములు, ప్రసాద్, నరేష్, రవి, షేక్ సుబాని తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియాతో అధిక ప్రయోజనం



**ప్రజాపక్షం/చింతకాని :** నానో యూరియా వాడకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ మధిర ఏడిఏ స్వర్ణ విజయచంద్ర రైతులకు సూచించారు.మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో నానో యూరియా వాడకం వల్ల కలుగు ప్రయోజనాలను రైతులకు వివరించారు.నానో యూరీయా వాడకం వల్ల మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరక్టర్ కొప్పుల గోవిందరావు, ఏఈవో రాము, ఫెర్టిలైజర్స్ డీలర్స్ మందా గోపాలరావు, పున్నం రాజు, రైతులు తన్నీరు నాగభూషణం, బోళ్ల నాగేశ్వరరావు, పోట్ల సీతయ్య, దమ్మాలపాటి భూషయ్య, ఎండపల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి




**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గా భవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం చింతకాని మండల టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్వత్వ నమోదు, ఫండ్ క్యాంపెన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో దుర్గాభవాని మాట్లాడుతూ ప్రభుత్వ ఎన్నికల మ్యానిఫెస్టో ఏ ఒక్క హామీ అమలు కాలేదని, నాయకుల మాటాలు నీటి మూటలుగానే మిగిలాయన్నారు. ప్రభుత్వం పీఆర్సీనివేదిక తెప్పించుకుని 01జులై 2023 నుండి అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను , డిఏలు వెంటనే విడుదల చేయాలన్నారు.ఉద్యోగ , ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ఇదే ఉదాసీనత ప్రదర్శిస్తే ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడిఎస్వీ రమణ, తోటకూరి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, భాగ్య, ప్రీతమ్, జమలయ్య , అనిల్, సురేష్, రాజయ్య, పుల్వారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి రూ. 2.96 కోట్లు మంజూరు

**-నిధులను సద్వినియోగం చేసుకోవాలి**
**-అదనపు కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ. 2.96 కోట్లు మంజూరు చేసిందని ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీజ తెలిపారు. గురువారం కలెక్టరేట్ నందు అదనపు కలెక్టర్ పి. శ్రీజ అధ్యక్షతన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్, పంచాయతీరాజ్, టిజిఎస్ ఆర్టిసి శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ. 2.96 కోట్లు నిధులు కేటాయించారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ నిధులను కళాశాలల రిపేర్లు, వాటర్ సప్లయ్, ఎలక్ట్రికల్ రిపేర్, సివిల్ రిపేర్లు, టాయిలెట్ రిపేర్లు, ల్యాబ్ మెటీరియల్ కొనుగోలుకు, కళాశాల భవనాల రంగులకు వినియోగించాలన్నారు. ఈ పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. ప్రిన్సిపాల్స్ నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆర్టిసి బస్సుల ద్వారా విద్యార్థులు కళాశాలలకు సకాలంలో హాజరయ్యేవిధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఐఈవో కె. రవిబాబు, టిజిఎస్ ఆర్టిసి సిఐ రామయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, పంచాయతీ రాజ్ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యాచారాలను అరికట్టండి

**-ఎన్ఎఫ్ఐడబ్ల్యూ డిమాండ్**




**ప్రజాపక్షం/ఖమ్మం :** మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు ముఖ్యంగా మైనర్లపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయని ఖమ్మంజిల్లాలో ఒకే రోజు వెలుగు చూసిన రెండు ఘటనలు ఆలోచింపజేస్తున్నాయని ఆమె తెలిపారు. గురువారం పోటు కళావతి మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు తాటి నిర్మల ఈ మేరకు ఈ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బోనకల్ మండలంలో మూడవ తరగతి చదువుతున్న బాలికపై లైంగిక దాడి జరగగా, కామేపల్లి మండలంలో 15ఏళ్ల బాలిక గర్భం దాల్చడం శోచనీయమన్నారు. చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారని ఏదో ఒక రూపంలో నిందితులు బయటకు రావడంతో ఇటువంటి ఘటనలు పెరిగిపోతున్నాయన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి అత్యాచార నిందితులకు రోజుల్లోనే శిక్ష పడేవిధంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాల స్థాయిలోనే అత్యాచారాలు మొదలైతే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అశ్లీల సాహిత్యం, వీడియోలు యువతను పెడమార్గం పట్టిస్తున్నాయని వారు తెలిపారు. ఖమ్మం జిల్లాలో జరిగిన ఈ రెండు ఘటనలకు సంబంధించి తక్షణం కేసులు నమోదు చేయడంతో పాటు మానవ హక్కుల సంఘాలు సుమోటాగా స్వీకరించి విచారించాలని కళావతి, నిర్మల కోరారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ




**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందచేసిన ఏకరూప దుస్తులను, టై, బెల్టులను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు చేతుల మీదుగా పంపిణీ చేయటం జరిగింది. గురవారం మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్కే. షమీం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సిఎం మల్లు భట్టివిక్రమార్క తెలంగాణలో విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు. యంగ్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో ప్రతి నియోజకవర్గంలో రూ.200కోట్లతో అన్ని వసతులతో కూడిన గురుకుల పాఠశాలల నిర్మాణం చేయటం జరుగుతుందని తెలిపారు. మధిరకు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం త్వరలో గురుకుల పాఠశాల విద్యార్థులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం చేయించటం కోసం ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవి కుమార్, బాణావత్ వెంకటరమణనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, నాయకులు దుంప వెంకటేశ్వరరెడ్డి, నిడమనూరు వంశీకృష్ణ, షేక్.జహంగీర్ బాజీ, బొల్లెద్దు రాజేంద్ర, తిరువేదుల రమేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అధికార పార్టీ నాయకులు, అధికారుల తీరుపై
# తొండలగోపారం గ్రామస్తులు ఆందోళన




**ప్రజాపక్షం/ మధిర :** అధికార పార్టీ నాయకులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తొండలగోపారం గ్రామస్తులు స్థానిక ఎంపిడిఓ, ఆర్అండ్‌బి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ మధిర మండలం తొండలగోపారం గ్రామపంచాయతీ పరిధిలోని తొర్లపాడు గ్రామంలో రోడ్డు పక్కన నిర్మించిన ఇల్లు తొలగించాలని ఆర్అండ్‌బి అధికారుల ఆదేశాలతో గ్రామపంచాయతీ కార్యదర్శి మద్దాల ఏబు తండ్రి పద్మారావు పేరుతో ఉన్న ఇంటికి నోటీసు ఇచ్చి వెంటనే తొలగించాలని ఆదేశించినట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న అధికార పార్టీ నాయకులు రాజకీయ కక్షసాధింపు కోసం కావాలని ఇలాంటి నోటీసులు పంపారని, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క పేరు చెప్పి కొందరు అధికార పార్టీ నాయకులు ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ఆర్అండ్‌బి స్థలం ఆక్రమణకు గురైతే తప్పకుండా వెలికితీయాలని, ఆ విషయం అన్ని రాజకీయ పార్టీల పట్ల అధికారులు సమాన చర్యలు తీసుకోవాలని కోరారు. అలా కాకుండా కేవలం సిపిఎం పార్టీ కార్యకర్త అయిన మద్దాల ఏబుకు మాత్రమే నోటీసు ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణకు గురైన స్థలాన్ని ఆర్అండ్‌బి అధికారులు మార్కింగ్ పెట్టి అందరికి నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశా. అదేవిధంగా గ్రామంలో సర్వేనెంబర్ 17 నందు అన్యాక్రాంతమైన దళిత ఇళ్ల స్థలాలకు వెంటనే హద్దులు ఏర్పాటు చేసి ఆ స్థలాన్ని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మందా సైదులు, డివిజన్ నాయకులు పాపినేని రామనర్సయ్య, మద్దాల ప్రభాకర్, పడకంటి మురళీ, నాయుడు శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆరున సిపిఐ నగర మహాసభ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం నగర సమితి మహాసభ ఈనెల ఆరున జరుగుతుందని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా నేడొక ప్రకటనలో తెలిపారు. ముస్తఫా నగర్‌లోని సెంట్ మేరీస్ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు మహాసభ ప్రారంభ మవుతుందన్నారు. ఈ మహాసభలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ మహాసభలో పార్టీ నిర్మాణం, నగర సమస్యలు తదితర వాటిపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు ఆయన తెలిపారు.

# నేడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఖమ్మం జిల్లా 26వ మహాసభ కొణిజర్లలో సిద్ది వెంకటేశ్వర్లు, వెంపటి సూర్యనారాయణ నగర్‌లో జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి ఏసు, తాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మహాసభలకు 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ తదితరులు పాల్గొననున్నారని వారు తెలిపారు. మహాసభల్లో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించుకోవడంతో పాటు నూతన నాయకత్వాన్ని ఎన్నుకోనున్నట్లు వారు తెలిపారు.

# నానో యూరియా వినియోగంపై అవగాహన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నానో యూరియా, నానో డిఏపి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మండల పరిధిలోని హర్యా తండా గ్రామంలో నానో యూరియా, నానో డిఏపి వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పత్తి, మిర్చి, వరి, కూరగాయలు పండించే రైతులు భూమిలో సేంద్రీయ కార్బనాన్ని, సేంద్రీయ పదార్థాన్ని పెంపొందించుకుంటే రసాయన ఎరువుల వాడే అవసరం తగ్గుతుందన్నారు. రసాయనిక ఎరువులు అయినటువంటి యూరియా, డిఏపి కాంప్లెక్స్‌లు వాడినట్లయితే భూమి యొక్క సారం దెబ్బతిని చౌడబారుతుందన్నారు. యూరియా, డిఏపిలకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డిఏపిలను వాడుకుంటే రైతులకు రసాయన ఎరువుల మీద పెట్టేటటువంటి ఖర్చు కూడా తగ్గడంతో పాటు భూసారం మెరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ మహీందర్‌రెడ్డి, ఏఈవో శివకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన పోలీసు అధికారులు



**ప్రజాపక్షం/ఖమ్మంక్రైం :** ఖమ్మం టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసుగా సత్యనారాయణ, మహిళ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా చిట్టిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపి వారికి శాఖపరమైన సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను విచారించి సత్వరమే పరిష్కరించాలని మహిళపోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ చిట్టిబాబుకు సూచించారు. మాధక ద్రవ్యాలు, అసాంఘిక కార్యాకలాపాలపై నిఘా ఉంచి క్రయ, విక్రయదారులను గుర్తించి కట్టడిచేయాలని టాస్క్‌ఫోర్స్ ఏసిపి సత్యనారాయణను ఆదేశించారు.

# ఆక్రమించిన కాల్వను పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం ఈదుల చెరువు నుంచి వచ్చే అలుగు కబ్జాను తొలగించి పునరుద్ధరించాలని,బిఆర్ఎస్ నాయకుడు బానోత్ కృష్ణ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. సంబంధిత కాల్వ ఆక్రమణకు గురికావడంతో కురుస్తున్న వర్షాలతో గిస్కా కాలనీ మునకకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ వారు కాల్వను మూసివేయడంతో డ్రైనేజీ వాటర్ రోడ్డుపైకి వచ్చి దుర్వాసన వెదజల్లుతున్నట్లు తెలిపారు. కావున తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు బానోత్ వీరన్న ఉన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి గ్రామానికి చెందిన పారా కిషోర్, లక్ష్మి దంపతుల కుమార్తె అంజలి(22) 2024 సెప్టెంబర్ 9న సిరిపురం గ్రామానికి చెందిన తడికమళ్ళ రాముఅనే వ్యక్తితో ప్రేమ వివాహం జరిగింది. గత కొంతకాలంగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో అంజలిని భర్త రాము మానసికంగా, శారీరకంగా వేధిస్తూ ఉండటంతో మనస్థాపానికి గురైన అంజలి గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలుపుతున్నారు. తన కూతురి మృతిపై అనుమానం ఉందని, దీనిపై విచారణ చేసి న్యాయం జరిపించాలని అంజలి తల్లిదండ్రులు పారా కిషోర్, లక్ష్మిలు మధిర టౌన్ పోలీస్ స్టేసన్ నందు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థి ఉద్యమ దిక్సూచి ఏఐఎస్ఎఫ్




- విద్యా కాషాయీకరణ, కార్పోరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. గురువారం పాల్వంచలోని చంద్రా రాజేశ్వరరావు భవన్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా 4వ మహాసభ నిర్వహించారు. ప్రారంభ సూచికగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఉప్పెశెట్టి రాహుల్ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ బ్రిటీష్ పరాయి పాలకుల చెర నుండి భరతమాత విముక్తి కోసం విద్యార్థులు అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి లక్నో నగర బెనారస్ విశ్వవిద్యాలయంలో 1936 ఆగస్టు 12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం అనంతరం విద్యార్థిరంగ సమస్యల పరిష్కారమే ఏకైక లక్ష్యంగా ఆనాటి నుండి నేటి వరకు సమరశీల ఉద్యమాలను కొనసాగిస్తున్న ప్రథమ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై కొట్లాడి సాధించుకున్న తెలంగాణాలోని విద్యాఉపాధి హక్కుల సాధనకై సమరశీల పోరాటాలు చేయాలన్నారు. కేంద్రప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని, కేవలం డబ్బున్న వాడే విద్యను అభ్యశించే రోజులు రానున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విద్యావిధానాన్ని కేంద్రప్రభుత్వం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా దళిత,గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. దేశంలో పుట్టిన ప్రతీ బిడ్డకు సమాన విద్యను అందించాలని, డిగ్రీ పూర్తి చేసిన ప్రతీ విద్యార్థికి భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేసి ప్రభుత్వవిద్యారంగానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలు, ఫీజు రియింబర్స్మెంట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి ఇటుకల రామకృష్ణ మాట్లాడుతూ పూర్తి స్థాయి వార్డెన్లు లేక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. గత పాలకులు నిర్లక్ష్యంతో విద్యారంగం తీవ్ర నష్టల్లో కూరుకుపోయిందని, నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వర్క అజిత్, యు హరీష్, షాహిద్ , రణధీర్ అధ్యక్షతన జరిగిన మహాసభలో మాజీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే చాంద్ పాషా, జిల్లా కార్యదర్శి ఎకేసీ పహీం దాదా, అధ్యక్షులు జర్పుల ఉపేందర్, గుండాల సుజన, పవన్ సాయి, నాగేంద్రబాబు, బతుల సాయి, వినయ్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : వాతావరణంలో మార్పులు సంభవిస్తున్న నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఐడీఓసిలో జిల్లాలోని ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, నర్సింగ్ సూపరింటెండెంట్లు,ఫార్మాసిస్టులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని, టెస్టింగ్ కిట్లు సిద్ధంగా ఉండాలని సూచించారు. వివిధ హోదాల్లో ఉన్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని, ఇప్పటికే అన్ని ఆస్పత్రులకు కావాల్సిన మందులు రీఏజెంట్లు,మౌళిక వసతులు, ఆధునిక యంత్రాలు ఏర్పాటు చేసిన క్రమంలో రాబోయే రోజుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. ఆస్పత్రుల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆస్పత్రుల్లో ఇన్సులిన్ మలేరియా మందులు లేవని వైద్య సిబ్బంది జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రాష్ట్ర అధికారులతో మాట్లాడి వాటిని అందుబాటులోనికి తీసుకురావడానికి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా డిసిహెచ్ఎస్ డా.రవిబాబు, వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులు, నర్సింగ్ సూపరింటెండెంట్లు, శానిటేషన్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# మహిళా ఆరోగ్యవికాస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు




ప్రజాపక్షం/భద్రాచలం : మహిళా ఆరోగ్యవికాస్ అందిస్తున్న సేవలను మహిళంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. స్థానిక జీయర్ మఠంలో వికాసతరంగిణి, లైయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఇచిత గర్భకోశ వ్యాధుల పరీక్ష శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ఆరోగ్య వికాస్ అందిస్తున్న సేవలు నియోజకవర్గ స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 30 సం. లు పైబడిన మహిళలు తప్పని సరిగా గర్భకోశ పరీక్షలు చేయించుకోవాలని, ఎలాంటి దోషాలు ఉన్నా వెంటనే మందులు వాడటం మొదలు పెట్టి తగ్గించుకోవాలని సూచించారు. నేటి రోజుల్లో ఆరోగ్యాలను కాపాడుకోవడం ఎంతో అవసరమని, ఇందుకోసం ప్రతీ ఒక్క మహిళా వ్యక్తిగత ఆరోగ్యజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యశిబిరం వద్ద ఎంఎల్ఏకు షాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వికాసతరంగిణి, లయన్స్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

# భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం : కలెక్టర్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కొత్తగూడెంలోని రైటర్ బస్తీని భవిత కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడి సౌకర్యాలు, అందుబాటులో ఉన్న పద్ధతులు, నిర్వహణతీరు, విద్యార్థుల హాజరును ఆయన పరిశీలించారు. అనంతరం కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముచ్చటించారు. దివ్యాంగ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్లో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉజ్వల భవిషత్ కేంద్రాలుగా దివ్యాంగులకు భవిత సెంటర్లు ఉపయోగపడుతున్నాయని, ప్రత్యేక అవసరాలు గల పిల్లల బోధనకు కోసం అన్ని పరికరాలు, స్టడీ మెటీరియల్ తెప్పించాలని ఆదేశించారు. రెయిలింగ్, ర్యాంపు, రాంప్ వంటివి పటిష్టంగా ఉండాలన్నారు. ఫిజియోథెరిపిస్టు ఖచ్చితంగా కేంద్రానికి వచ్చేలా చూడాలని, భవిత కేంద్రాంలో విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్ది ప్రత్యేక పాఠశాల నుండి సాధారణ పాఠశాలకు పంపడానికి చేస్తున్న కృషిని, సిబ్బందిని అభినందించారు. ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ డా.ప్రభు దయాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవిఎం గోదాము పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఈవిఎం గోదాము పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఆర్‌డిఓ కార్యాలయం ప్రాంగణంలోని ఈవిఎం గోదామును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవిఎం భద్రతకు సంబంధించి ప్రతినెలా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే ఇప్పుడు తనిఖీ చేసినట్లు చెప్పారు. సిసి కెమెరాల పనితీరును కూడా పరిశీలించామన్నారు. అనుమతి లేనిదే గోదాములోనికి ఎవ్వరినీ అనుమతించరాదని అధికారులు, సెక్యూరిటీ గార్డులకు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయలక్ష్మీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఏజీహెచ్ఎస్ అనంతోగు, ఏహెచ్ఎస్ మర్కోడులో జరుగుతున్న సికిల్ సెల్ పరీక్షలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పిల్లలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ అనే రక్తహీనత వ్యాధి గురించి అవగాహన కల్పించారు. అలాగే సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ సంఘమిత్ర, డాక్టర్ రేవంత్, సిహెచ్‌వో సోమ్లా నాయక్, ఎస్‌యూవో హరికృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ టి రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ మంకిడి నరేష్, ఎం శ్రీధర్‌బాబు, ఎంఎల్‌పిహెచ్ రేవతి, ఏఎన్ఎంలు సావిత్రి, రమణ, ఆశాలు పాల్గొన్నారు.

# ఎంఎల్ఏ పాయంను కలిసిన ఎస్ఐ మేడ



ప్రజాపక్షం/బూర్గంపాడు: మణుగూరు ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయం నందు ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు బూర్గంపాడు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మేడ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లుకు పూల మొక్కను అందజేశారు.

# టిబి నిర్మూలనకు కృషి చేయాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : టిబి నిర్మూలనకు అంతా కృషి చేయాలని కేంద్ర టిబి విభాగం అదనపు కార్యదర్శి, జాతీయ ఆరోగ్య మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆరాధన పట్నాయక్ అన్నారు. గురువారం ఆమె జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు ఐడిఓసి లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి ఎస్ విజయలక్ష్మీ, జిల్లా టిబి ప్రోగ్రాం ఆఫీసర్ డా.బి పుల్లారెడ్డి హాజరయ్యారు. ఈ మేరకు ఎన్‌హెచ్ఎం మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు వ్యాధి గ్రస్తులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. 2025 చివరి నాటికి క్షయవ్యాధి రహిత భారత దేశాన్ని సాధించాలని సూచించారు.

# ఘనంగా మట్టా ఆశా వర్ధంతి



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని క్యాంప్ కార్యాలయం ఎమ్మెల్యే డా.మట్టా దంపతుల కుమార్తె కీ.శే.లు మట్టా ఆశావర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆశా జ్ఞాపకాలు స్మరించుకుంటూ, ఆమె జ్ఞాపకార్థం తల్లిదండ్రులు ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్‌కుమార్ లు మొక్కలు నాటి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆశా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

# మహాదేవపురంలో వైద్య శిబిరం



ప్రజాపక్షం/ మధిర రూరల్ : మండల పరిధిలోని మహాదేవపురం పల్లె దవఖానా నందు దెందుకూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.సాయిపృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం టిబి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా తెమడ సేకరించి టీహబ్‌కు పంపించారు. సీజనల్ వ్యాధులకు తగిన చికిత్స చేసి చిరువ్యాధులకు మందులు పంపిణీ చేశారు. టిబి వ్యాధిపై సంపూర్ణంగా చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మధిర టిబి యూనిట్ సిబ్బంది, సూపర్‌వైజర్ సందీప్, ఆరోగ్య, పల్లె దవఖానా సిబ్బంది పాల్గొన్నారు.

